# పెద్దప్రాణం ఎక్కడుండాలి?

రచన :
శ్రీమతి ఎస్. పి. సాయిలీల

(గతసంచిక తరువాయి)

వైదేహి స్వభావానికి నేరువిరుద్ధం వసంతి స్వభావం. పదిమందితో కలిసిమెలిసి మాట్లాడడం, నలుగురు మనుష్యులు ఇంటికి రావాలనుకోవడం, నలుగురికి ఇంట్లో అన్నం పెట్టాలనుకోవడం, వైదేహి స్వభావమైతే, పదిమందితో కూర్చోవడమే ఒక బోరని, నన్ను ముద్దు పెట్టుకోకు, నామాట కాదనే వింత ధోరణిలో, నామొగుడూ, నేను బావుంటే చాలనుకొనే స్వభావం వసంతది. ఈ ఇద్దరితో వేగలేకపోయేది లక్ష్మి. పెద్దకోడలితో మాట్లాడితే చిన్నకోడలికి కోపం, చిన్నకోడలితో కాస్సేపు కలివిడిగా వున్నప్పుడు పెద్దకోడలికి కోపం. ఇదేమిటిరా భగవంతుడా ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనకా తల చచ్చిపడినట్లయిందని బాధపడేది లక్ష్మి.

ఋతువులు మారుతున్నట్లే మనుష్యులస్వభావాలలో కూడా మార్పులొస్తూవుంటాయి, మానవసహజమైన ఆ గుణాన్ని ఆ భగవంతుడుకూడా మార్చలేడు. ఒకొక్కరికి ఒకొక్కవిధంగా వుంటుంది గుణం. కొందరు మంచిగా, వుందామనుకుంటారుగాని, ఎంతసేపు ఎదుటివారు తమతో చెడ్డగా ప్రవర్తిస్తున్నప్పుడు ఎప్పుడో అప్పుడు ఈ మంచిగా వుందామనుకున్నవాళ్లుకూడ చెడ్డగా మారితీరుతారు. ఇలాగే అయింది వైదేహి పరిస్థితి. తనెంత మంచిగా పోదామని ప్రయత్నించినా తనలో తప్పులు వెతుకుతున్న వసంత గుణాన్ని ఇంక సహించలేకపోయింది. పొద్దున్నలేస్తే ఇంట్లో యుద్ధకాండ మొదలయ్యేదా ఇంట్లో. ఇటు పెద్దకోడలిపక్షం పలకలేక, అటు చిన్నకోడలిపక్షం మాట్లాడలేక, ఒకమూల కూర్చుందామన్నా కూర్చోలేక వాళ్ళమధ్యలో నలగసాగింది లక్ష్మి. పెద్దవాడికి ఇద్దరమ్మాయిలు ఒక అబ్బాయి. అయితే చిన్నవాడికి ముగ్గురమ్మాయిలు ఒక అబ్బాయి సంతానం కలిగారు. ఇంట్లో ఆడవాళ్ళ తగవులు మొగవాళ్ళదాకా వెళ్ళాయి. ఎప్పుడైతే మొగవాళ్ళు కూడా కలుగచేసుకున్నారో ఆ ఇల్లు రెండయితీరుతుంది. భార్యని తన కంట్రోలులో పెట్టుకోని చేతకాని చవటదద్దమ్మని మురళిని గోపి తిట్టాడు, "నీభార్యచేతిలో కీలుబొమ్మని ఆడించినట్లు ఆడుతున్నావని" తమ్ముడిని అన్న తిట్టాడు. చిలికి చిలికి గాలివానయినట్లు అన్నదమ్ముల పిల్లలలో చీలికలు ఏర్పడ్డాయి. మద్రాసులోని ట్రిప్లికేన్‌లో ఇల్లు తీసుకుని మారిపోయాడు. రెండోవాడు తన కుటుంబంతో. పెద్దవాడి దగ్గరుంటున్న లక్ష్మికి ఏది తింటున్నా, ఏది త్రాగుతున్నా చిన్నవాడిమీద ధ్యాసమొదలై "వాడెలావున్నాడో, పెళ్ళాం ఏం పెడ్తోందో"నని ఆలోచించసాగింది. క్రమక్రమంగా పిల్లలుకూడా వాళ్ళ బామ్మని హీనంగా చూడసాగారు. నెమ్మది నెమ్మదిగా వంట చేతికిచ్చింది పెద్దకోడలు. "వృద్ధాప్యమనేది శాపం లాంటిదే ! ఆడవాళ్ళకి మరీ శాపం ఆ దశ. బాల్యంలో తల్లిదండ్రుల అదుపు ఆజ్ఞలలో వుండక తప్పదు, ఆతర్వాత భర్త కనుసన్నలలో వుండక తప్పదు. ఇంక వృద్ధాప్యంలో, ముసలివయస్సులో కొడుకులదగ్గర కాలక్షేపం చెయ్యాలి కాబోలు ! కూతుళ్ళా నాకు లేరు. 'అమ్మా' కష్టపడ్తున్నావా ? అని కూతురైనా అడిగేదేమో ! ఇప్పుడు నాగతేమిటి ?" ఆలోచించుకుంటూ వంట చేస్తున్న లక్ష్మి ఆరోజు చారుగిన్నె కుంపటిమీదనుంచి దించబోతూ క్రింద పడవేసింది.


"మీ పెద్దకొడుకు సంపాదన ఏ చెట్టుమీదనుంచి కోసుకు రావటంలేదు. ఆయన రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి మీముఖంమీద పోస్తున్నారు. ఇదే మీ రెండోకొడుకింట్లో వుంటె ఇలా ప్రతివస్తువూ నేలపాలు చేసేవారా,



మీకా పక్షపాతం ఎందుకు ? మీ రెండో అబ్బాయిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టామని మామీద కక్షవున్నా, ఈవిధంగా చూపించాలా ? వస్తువు పాడుచేస్తాగా ? ఇంకా మేము ఇద్ద రమ్మాయిలకి పెళ్ళిళ్ళు చెయ్యాలి. వాళ్ళు పెళ్ళీడుకొచ్చారు. వున్న ఒక్కపిల్లవాడికి పెద్దచదువు చెప్పించాలి. ఈ దుబారా మేము భరించలేం బాబూ'' గట్టిగా రంకెలు పెట్టింది వైదేహి. అసలే తల్లిని ఇంట్లోంచి ఎలా వెళ్ళ గొట్టాలాని ఆలోచిస్తున్న మురళి ''ఏందమ్మా, ఈ జగడాలు' ఇలాఅయితే నేను సంపాదించినట్లే. నీకు వాడిమీద అంత ప్రేమవుంటే అక్కడే వుండు, ఇక్కడనుంచిపో'' కసిరినట్టుగా అని వెళ్ళిపోతున్న పెద్దకొడుకు, వంశోద్ధారకుడు, కొరివి పెట్టవలసినవాడు, అంటోంటే గుడ్లమ్మట నీరు కార్చుకుంటూ కుక్కినపేనులా కూలబడిపోయిం దొక చోట ఆ ఇంటి యజమానురాలు లక్ష్మి.

''బామ్మా ! ఎవరో నాన్నకి తెల్సినవాళ్లొచ్చారు. వాళ్లు ట్రిప్లికేన్ వెళ్తున్నారుట. కారులో నిన్ను తీసుకెళ్ళి అక్కడ దింపేస్తారుట నిన్ను. నీసామాను సర్దుకో'' అంటూన్న పెద్ద మనుమరాలి మాటలువిని నోట మాటరాక నిశ్చేష్ట రాలై నిలబడిపోయింది కాస్సేపు. ఆతర్వాత నెమ్మదిగా చేతిసంచిలో వున్న నాలుగు వెలిసిపోయిన చీరలు, వెలిసిన రవికలు రెండు వేసుకుని బయలుదేరింది. ''వస్తానురా, అబ్బాయ్'' అంటూన్న తల్లివైపు, చూడను కూడా చూడ లేదు పెద్దకొడుకు. ''వస్తానని'' కోడలివైపు తిరుగబోతే అక్కడినుంచి ఆవిడ మాయమయింది. పిల్లలతోచెప్పి కారెక్కింది. కళ్ళంట నీళ్లు కారుతున్నా తుడుచుకోవాలనే ఆలోచనకూడా రాలేదు పాపం ఆ వృద్ధురాలికి !

ట్రిప్లికేన్‌లో ఇంటిదగ్గర కారు దిగగానే ముగ్గురు మనుమరాళ్ళు, ఒక మనుమడు దగ్గర చేరారు. వాళ్ళతో కబుర్లుచెప్పుకుంటూ కూర్చుండిపోయింది కాస్సేపు.' కోడలు గాని కొడుకుగాని పల్కరించరేం వచ్చి ? పెద్దదాన్నిగదా ! ఆమాత్రం గౌరవించలేదేమిటి ?'' అనుకుంది తనలో. ''ఏమర్రా, అమ్మా, నాన్నా ఏది అంది నెమ్మదిగా. ''కారాగడం, నువ్వు దిగడంచూసి లోపలికెళ్ళిపోయా రిద్దరూ'' అన్నాడు మనుమడు. వాడివైపు గుడ్లురిమిచూసారు మనుమరాళ్ళు ముగ్గురూ. రాత్రి అవుతోందనగా చిన్నకొడుకు నెమ్మదిగా బయటికివచ్చాడు. ''ఎలావున్నావ్ ?'' పొడిగా అడిగి వెళ్ళిపోయాడు వేరేగదిలోకి తనబాధ్యత తీరినట్లు. 'బావున్నారా?' చిన్నకోడలు వసంత వచ్చి పల్కరించింది. 'చాలాసేపయిందమ్మా వచ్చి, మీరిద్దరూ ఏదని అడిగాను. బావున్నావా వసంతా?' అంది లక్ష్మి. 'ఏం బావుండడం, ఒకటే బావుండడం, ఆయనకా హై బి. పి. నాకా బ్లడ్ కొలెస్ట్రాల్. ఇంక పిల్లలు నల్గురికీ ఎప్పుడూ రోగాలే. ఆయనసంపాదన మాకే సరిపోవడంలేదు. ఆడపిల్లలకి ఒక నగా నట్రాకూడా చేయించలేదు. ఏది వచ్చిందంతా తిండికే సరిపోతోంది. ఇంక నగలెక్కడినుంచి వస్తాయి ? ఈకాలం మనుష్యుల్ని భరించడం చాలా కష్టంగా వుంది.



***

''ఖైదీ''

చిత్రంలో

చిరంజీవి - మాధవి.

***

మీ పెద్దబ్బాయి ఇక్కడికి పంపించారేమిటి మిమ్మల్ని ? ఆయనకేమిటి ? పెద్దవుద్యోగం, ముగ్గురే పిల్లలు. మాదగ్గ రేం మూలుగుతోందని పంపించారు మిమ్మల్ని?' ఎదురు గుండా నిర్మొహమాటంగా అడుగుతున్న కోడలిని ఏమన గలదు ? ఏం సమాధానం చెప్పగలదు ?

*　　　　*　　　　*

కోడలు ఎత్తెత్తి ఆకుల్లో ముష్టివాళ్ళకి పడేసినట్లు పడేసిన అన్నం నాలుగుముద్దలుతిని చెయ్యి కడుక్కొని లేచిందక్కడినుంచి. 'ఛ, తనబ్రతుకు ఎంత హీనంగా తయారైంది. ముష్టివాళ్ళకికూడా అన్నం అలా ఎత్తెత్తి పడేస్తే, నీఅన్నం నువ్వుంచుకోమ్మా, మా కక్కరలేదం టారు. అలాంటిది స్వంత అత్తగారనే గౌరవమైనాలేకుండా ఇలా ప్రవర్తించిందేమిటి వసంత? నేను నా అత్తగార్ని ఇలాగే చూసానా? కన్నతల్లికన్న ఎక్కువగా చూసుకున్నా నే! ఈనాటి కోడళ్ళప్రవర్తన ఇలా వుందేమిటి? వాళ్ళ మొగుళ్ళు ఎక్కడనుంచి వచ్చారేమిటి? నేను కంటేకదా వచ్చారు. పెద్దకోడలేమో పాచిపని, వంటపని జాలైనా లేకుండా పెద్దిదాన్ని, ముసలిదాన్ననికూడా ఆలోచించకుండా చేయించింది. ఈకోడలేమో! మొగాడ్నికన్నా తల్లిని మర్యాదాలేకుండా ముఖంమీద కొట్టినట్లు మాట్లాడింది. కొండలాంటి నాథర్త నన్నువిడిచి పరలోకానికి వెళ్ళి పోయాడు. నాకింకేంగతి! తోడబుట్టినతోడు దగ్గరకెళ్తే నీకొడుకులిద్దరున్నారు, మాదగ్గర కెందుకొచ్చావంటారు ? ఈ కొడుకులిద్దరూవున్నా నరకంనుంచి తప్పించరు, తోసే స్తారు. వీళ్ళా నాకు తలకొరివిపెట్టి తద్దినం పెట్టేది' తెల్ల వార్లూ ఆలోచిస్తూ నిద్రపోకుండా గడిపింది ఆరాత్రి లక్ష్మి.

అరవైఎనిమిదేళ్ళ లక్ష్మికి కళ్ళచూపు సరిగ్గా ఆనడం లేదు. నాలుగేళ్ళయింది ఏకొడుకూ కంటికి కళ్ళజోడు ఇప్పించలేదు. చెవులు సరిగ్గా విన్పించడంలేదు. దాని గురించి పట్టించుకొనే నాధుడే లేడు. పళ్ళు వూడిపోయి నాలుగేళ్ళపైన అయింది. పళ్ళసెట్ కట్టించాలి, తల్లి బోసి నోటితో తిండి తినలేక బాధపడ్తోందనేధ్యాస లేదు కొడుకు లకి. చీర కట్టుకోవడానికి చీరముడి గట్టిగా వేసుకోలేనిస్థితి కొచ్చింది. నడుస్తున్నప్పుడు కాళ్ళు పట్టుతప్పి పడిపోతుం దనే పరిస్థితికొచ్చింది. వారంరోజులు అతికష్టంమీద ఎన్నో మాటలు కొడుకు, కోడలిచేత ఆఖరికి మనుమలచేత మాట లనే బాణాలను అవలీలగా భరించింది. ఆరోజు ఆదివారం. ఇంటికి ఎవరో నల్గురు ఫ్రెండ్సు వచ్చారు. వాళ్ళముందు వెలిసినచీరతో, చిరిగినరవికతో కూర్చున్నలక్ష్మిని చూసి ఆవిడెవరని అడిగారు ఆవచ్చినఫ్రెండ్సు కొడుకుని, 'మా అమ్మ' అన్నాడు చిన్నకొడుకు నెమ్మదిగా. 'మీ అమ్మగారా, అలావున్నారేంటి? ముసలమ్మలాగా! మీకూ, ఆవిడకి పోలికే లేదు. మీ పర్సనాలిటీ వేరు, ఆవిడపర్సనాలిటీ వేరు. నేను మీకు బంధువేమో ననుకొన్నాను, మాఅమ్మకూడా ఇంతే! ఇంటికి వచ్చినవాళ్ళముందు మాపరువు తీసేస్తుంది ఒకొక్క సారి. ఎన్ని కొనిపెట్టినా బీదఏడుపే ఎప్పుడూ? ఈ పెద్దాళ్ళ కసలు రానురాను బుద్ధులు పోతున్నాయి. ఈ పెద్దాళ్ళకోసం ఏ శరణాలయాలో కట్టించాలి గవర్నమెంటువారు. అప్పుడు కాని ఈపెద్దాళ్ళకి కొడుకులవిలువ తెలియదు' అంటూ పక పకా నివ్వాడు అదేదో జోక్ వేసినట్లు.

ధుమధుమలాడుతూ వాళ్ళందరూ వెళ్ళాక రెండో కొడుకొచ్చాడు తల్లిదగ్గరికి. 'మాపరువు నల్గురిలో తియ్యా లని చూస్తున్నావా? ఆ చిరిగిన రవికేమిటి? ఆ వెలిసిపోయిన చీరేమిటి? ఛ, ఛ నాతల్లని చెప్పుకోడానికే సిగ్గుగావుంది. ఆమాత్రం నీట్‌గా వుండాలని తెలియదా ?' అన్నాడు కోపంగా. అగ్నిపర్వతం బద్దలవడానికి సిద్ధంగావుంది. అది ఎప్పుడు బద్దలవుతుందో! ఇన్నాళ్ళు వుగ్గబట్టి వుగ్గబట్టివున్న అగ్నిగుండం పేలడానికి సిద్ధంగావుంది. కొడుకులు పెద్దవా ళ్ళయినదగ్గర్నించి ఓపికగా వాళ్ళమాటన్ని భరించిన ఆ హృదయం ఇంక భరించలేకపోయిందిప్పుడు. 'ఒరేయ్ గోపి, మురళిని వాడిభార్యని, వాడిపిల్లల్ని ఇప్పుడే రమ్మన మను. నువ్వుకూడా నీ భార్యాపిల్లలతో ఇక్కడే వుండు' అంది.

పెద్దకొడుకు మురళి, పెద్దకోడలు వైదేహి, ఇద్దరు మనుమరాళ్ళు, మనుమడు, చిన్నకొడుకు గోపి, చిన్న కోడలు వసంత, ముగ్గురు మనుమరాళ్ళు, మనుమడు హాజ రయ్యారాగదిలో! 'ఏమిటమ్మా, ఎందుకు అర్జంటుగా ఫోను చేయించి పిలిపించావ్? ఎందుకని' అన్నాడు మురళి.


TRADE MARK PANJU TEX

మన్నికకు, అహ్లాదానికి ....

పంజు టెక్స్ వారి

శ్రీ మాస్టర్　శ్రీ ఫాంటెక్స్

ఫైన్ బనియన్లనే వాడండి.

ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు :—

దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

'మీకు మీఉద్యోగాలు, మీ భార్యా పిల్లలు వాళ్ళసంగతులే గాని మీకు తల్లంటూ వుందని మర్చిపోయారు. అందుకని మిమ్మల్ని మీకుటుంబాలతోసహా పిలిపించాను. తల్లి మీకు బ్రతికివుందని గుర్తు చేయాలికదా? చూడు నాయన గోపీ! చిరిగిన రవికె, వెలిసినచీర వేసుకున్నానని మీపరువు తీసానన్ని నిన్న తిట్టావే? నువ్వుగాని, నీఅన్నగాని నాకు చీరలు, రవికలు వున్నాయో, లేదోనని చూసారా' కనీసం నా కోడళ్ళయినా చూసారా? మీరెక్కడ చూస్తారు? మీ భార్యలకి చీరలేకొంటారా? మీపిల్లలకి బట్టలే కొంటారా! పండగ పండక్కి మీకుటుంబాలకి బట్టలు కొనుక్కున్నారుగాని నాకు కొనిపెట్టారా? మీరిద్దరూ చెప్పండి? మాట్లాడరేం? రేపు మీరే ముసలివాళ్ళయి మీకు ఇదే నాలాంటిగతే పడ్తే అప్పుడేం చేస్తారు? మీరు మీపిల్లల్ని ఎంత గారాబంగా పెంచుకుంటున్నారో అంతకి పదిరెట్లు గారాబంగా, మురిపెంగా పెంచాను మీ ఇద్దర్నీ. చివరికి నాకు జరిగిందేమిటి? మీరిద్దరూ చెరో బండరాయి నెత్తిమీద పెట్టారు. మురళీ నువ్వు నాపొట్టలో వున్నప్పుడు నేను తల్లి నవుతున్నానని ఎంత మురిసిపోయానురా! నాలో నేను! ఇలా నువ్వు నా ముఖంకూడా నువ్వు చూడవని అప్పుడు నాకు తెలియదురా! ఆవు దూడకి పాలిస్తున్నప్పుడు, పక్షులు వాటిపిల్లలకి నోటిలో ఆహారం పెడ్తున్నప్పుడు తన్మయంగా చూసి ఆనందించేదాన్ని. నేను మీనాన్నగారు ఇద్దరం నువ్వు పుట్టాక ఎంతో సంతోషపడ్డాము. నువ్వు 'ఊ' పల్కితే చాలు నాకు ఎంతసంబరమో? నేను, మీబామ్మ, మీనాన్నగారు అల్లారు ముద్దుగా నిన్ను పెంచుకొచ్చాము.

సీతమ్ముడు పుట్టాక వాడికేం తక్కువ చేయలేదు. గ్రామంనుంచి పట్నంవచ్చి నేను, మీనాన్న కష్టపడి మిమ్మల్ని వృద్ధిలోకి తీసుకురావాలని పాటుపడ్డాం. మేమిద్దరం బట్టలుకూడా కొనుక్కోకుండా మీఇద్దరికీ ఏదీ తక్కువ కాకుండా చూసాం. మీనాన్న పోయాక ఒకపూట తిండి తిని మిమ్మల్ని చదివించాను. 'మీరు నంది అంటే నందీని, పంది అంటే పందిని' మీరు ఆడినట్లు ఆడాను. మీకు నచ్చినసంబంధాలే చేసాను. చివరికి నాకు మిగిలిందేమిటి? చిన్నకోడలిచేత, పెద్దకోడలిచేత, మీ ఇద్దరిచేత ఆఖరికి నా మనుమలచేత అనరానిమాటలు పడ్డాను. చివాట్లు, చెప్పు దెబ్బలు తిన్నాను. చిన్నతనంలో ఒకలాగా వుంటుంది మన ఆకృతి. అదే ఆకృతి యౌవనంలో ఇంకొకలాగా వుంటుంది. కష్టాలు వంటబట్టి వృద్ధాప్యం వచ్చాక ఇంకొకలాగా వుంటాము. వృద్ధాప్యంవచ్చి పళ్ళు వూడిపోయి, తల ముగ్గు బుట్టయిన నాకు, మీకు పోలికలేదని నీ స్నేహితుడు నవ్వుతూ అంటోంటే మీరంతా నవ్వుతారా? సిగ్గులేదా నవ్వడానికి! రేపు నువ్వు ముసలాడివయ్యాక నీకొడుక్కి నీకు పోలిక లేదంటే నీమనస్సెలా వుంటుంది చెప్పు? మాట్లాడవేం? ఏమ్మా! మా అత్తగారు ఏవిధంగా చెప్పినా మంచి అర్థం తీసుకుని ఆవిధంగా నడుచుకొన్నానేగాని మీలాగా మాటకిమాట అనలేదమ్మా! మీ అమ్మలు మీ వదినలచేత పడ్తున్నబాధలు తెలుసా? అవి తల్చుకుని బాధ పడటం తెలుసా? మరి నాగురించి ఆలోచించరేం? మీ మొగుళ్ళని చదివించి మీచేతుల్లో పెట్టానే! మీకు నాగురించి నేనేమైనా అక్కర్లేదా? మీకూ కోడళ్లొచ్చి బాధలేవోపడ్డాక నాబాధ మీకు తెలుసొస్తుంది. పెద్దదాన్ని! అత్తగారనే గౌరవం లేకుండా ఇద్దరూ ఎన్నోమాట లన్నారు. ప్రేమాభిమానాలు పిల్లలకి మీరు నేర్పవలసింది పోయి నామీద ద్వేషం నేర్పారు. నామొగుడు నాకు బ్రతికుంటే మీ ఇళ్ళల్లోనే వుండను. ఆయ్యనతో గుడిసెలో వుండేదాన్ని. ఛీ! నామనస్సు విరిగిపోయింది మీ అందరిమీద! మీబాధలు మీరు పడ్తేగాని మీకు తెలిసిరాదు. ఎదుటివారు ఎలా బాధ పడిందీ' అంటూ లక్ష్మి వెక్కివెక్కి ఏడుస్తూ, 'మన గవర్నమెంటువారు వృద్ధులకి శరణాలయాలు కట్టిస్తున్నారని మన పక్కింటి శాంతమ్మగారు అక్కడ వుండవచ్చని చెప్పారు. ఆవిడ కొడుకులచేత విసిరివేయబడిన నాలాంటి ఆవిడే. మాలాంటివా రెందరో ఈ ప్రపంచంలో! రోజులు మారి మీరంతా చివరికి మీసంతానంచేత ఇలాగే విసిరివేయబడ్తారు. భగవంతుడా! తెల్లారేలోగా నీ పాదాలచెంతకి నన్ను చేర్చుకో! లేదా ఇంకా ఈ భూమ్మీద నాకు నూకలు చెల్లలేదని నీవనుకుంటే ఏదో ఒక శరణాలయంలో చేర్చు. ఈ పెద్దప్రాణం ఎక్కడుండాలో తేల్చు తండ్రీ'' అంటూ తలుపులు టపీమనివేసి గదిలోపల కూలబడింది లక్ష్మి.

(సంపూర్ణం)

